VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

ఆదివారం 19 మే 2024

సంపుటి.01 సంచిక.307



## మేడిగడ్డ పునరుద్ధరణ బాధ్యత

# నిర్మాణ సంస్థదే

**'మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనలో పునరుద్ధరణ పనులను నిర్మాణ సంస్థే చేయాల్సి ఉండగా ఎందుకు చేయడం లేదు? పని పూర్తి కాకుండానే సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.**

- మంత్రి ఉత్తమ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎన్డీఎస్ఏ నివేదికపై సుదీర్ఘ చర్చ
- బాధ్యులపై క్రిమినల్ చర్యలకు వెనకాడొద్దని స్పష్టీకరణ
- వచ్చే వారంలో ప్రాజెక్టు వద్దకు సీఎం



**హైదరాబాద్:** 'మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనలో పునరుద్ధరణ పనులను నిర్మాణ సంస్థే చేయాల్సి ఉండగా ఎందుకు చేయడం లేదు? పని పూర్తి కాకుండానే సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'పని పూర్తయితే, నిర్మాణ సంస్థ గడువు పొడిగించాలని ఎందుకు కోరింది? నీటిపారుదల శాఖ ఎందుకు పొడిగించింది? నిర్మాణ సంస్థపైన, బాధ్యులైన ఇంజినీర్లపైన ఎందుకు చర్యలు తీసుకోలేదు? మొత్తం రికార్డులన్నీ పరిగణనలోకి తీసుకొని నిర్మాణ సంస్థతోనే పని చేయించాలి' అని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాక శనివారం మంత్రివర్గ సమావేశం వాయిదా పడగా... మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథార్టీ(ఎన్డీఎస్ఏ) ఇచ్చిన మధ్యంతర నివేదిక, వర్షాకాలంలోగా చేయాలని సూచించిన పనుల గురించి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఆ సమయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం...

ఎన్డీఎస్ఏ నివేదికలో ఉన్న ముఖ్యమైన అంశాలు, సిఫార్సులన్నింటినీ ఉత్తమ్ వివరించారు. '2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్లు తేలింది. మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండదని తోసిపుచ్చలేం' అని ఎన్డీఎస్ఏ తన నివేదికలో స్పష్టం చేసిందని ఉత్తమ్ వివరించారు.


- సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- వరద నీటితో పొంగిపొర్లుతున్న నాలాలు
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్ ఆదేశం
- ఉమ్మడి మెదక్, భూపాలపల్లిలో జోరువాన
- బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్
- వాతావరణశాఖ వెల్లడి
- తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన
- అకాల వర్షాలతో చల్లబడ్డ వాతావరణం
- సూర్యతాపం నుంచి ప్రజలకు ఉపశమనం

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

**హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో వర్షం దంచికొట్టింది. మధ్యాహ్నం నుంచి కూడా వాతావరణం చల్లబడి ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో నగరం తడిసిముద్దయ్యింది. భారీ వర్షం కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ కూడా పూర్తిగా జలమయమయ్యాయి. నాలాలు వరద నీటితో పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపైకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. పలు చోట్లా వాహనాలు నీటమునిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సంబంధింత విభాగాల సిబ్బంది రంగంలోకి దిగి పరిస్థితులు చక్కబెడుతున్నాయి. కాగా, నగరంలోని వనస్థలిపురం, ఎల్బీనగర్, దిల్ సుఖ్ నగర్, నాంపల్లి, ఉప్పల్, ఖైరతాదాబాద్, ఓల్డ్ సిటీ, పంజాగుట్టా, మెహిదీపట్నం, మాదాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తోపాటు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. పలు చోట్లా భారీ వర్షం కురవడంతో వరద నీరు రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో ట్రాఫిక్ భారీగా జామ్ అయ్యింది. రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేస్తున్నారు. ఇటు లోతట్టు ప్రాంతాలన్నీ కూడా పూర్తి గా జలమయమయ్యాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్లా చెట్లు విరిగిపడి రోడ్లపై పడినట్లు తెలుస్తోంది. పలు చోట్లా రోడ్లు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా వరద నీరు ప్రవహిస్తుంది. ఇంకొన్ని చోట్లా వాహనాలు నీటమునిగాయి. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూడా వర్షం కురిసినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్లా భారీ వర్షం కురిసినట్లు సమాచారం అందుతోంది. వర్షం భారీగా పడడంతో పలువురు రైతులు పంటనష్టపోయినట్లు తెలుస్తోంది. అయితే, రాష్ట్రంలో వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సూచించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ కు దగ్గరగా ఉన్న వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి తోపాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మరికొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి వర్షాలు కురుస్తాయని, నాలుగు ఐదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొన్న విషయం విధితమే.

## యూపీఎస్సీ పరీక్షలు రాసే వారికి రూ. 3 వేలు

### మణిపూర్ ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం



**మణిపూర్:** అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు అరుదైన ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్ వెలుపల యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యే వారికి రోజుకు మూడు వేలు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఉత్తర్వులు కూడా జారీ చేసింది. జూన్ 16న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష జరగనుంది. మణిపూర్ అల్లర్లు, హింసాత్మక ఘటనలతో అట్టుడిగిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలోనే మణిపూర్ వెలుపల పరీక్షా కేంద్రాలను మార్చాలని, రవాణా సౌకర్యం కల్పించాలంటూ 140 మంది అభ్యర్థులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

# టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- అగ్రికల్చర్, ఫార్మసీలో 88.25శాతం బాలురు
- 90.18శాతం బాలికల ఉత్తీర్ణత
- ఇంజినీరింగ్‌లో
- 74 38శాతం బాలురు,
- 75.85శాతం బాలికల ఉత్తీర్ణత
- ర్యాంకులను ఎగురేసుకు పోయిన ఎపి విద్యార్థులు



2 లో

## టీఎస్ఎస్పీడీసీఎల్ ఇక నుంచి

# టీజీఎస్పీడీసీఎల్

### చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమ ఆకాంక్షలను రాష్ట్ర నామకరణం ప్రతిబింబించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. విధాన పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్‌లు, సర్క్యులర్‌లు, నివేదికలు , ఇతర కమ్యూనికేషన్ మెటీరియల్‌లతో సహా అన్ని అధికారిక పత్రాలు ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయాల యొక్క అన్ని అధికారిక కమ్యూనికేషన్‌లలో టీఎస్ కి బదులుగా టీజీ నామకరణాన్ని ఉపయోగిస్తాయి. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర సంస్థలు, స్వయంప్రతిపత్త సంస్థలు , ఇతర ప్రభుత్వ సంస్థలకు తెలంగాణ నామకరణం తక్షణమే టీఎస్ స్థానంలో రాష్ట్ర అధికారిక ప్రాతినిధ్యంగా టీజీ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం శాఖలకు పంపిన మెమోలో, తక్షణమే అమలులోకి వచ్చేలా టీజీని రాష్ట్ర స్థాయిలో అధికారిక సంక్షిప్తీకరణగా స్వీకరించినట్లు ఆమె తెలిపారు. తెలంగాణకు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం రెండవ ఉద్యమం ప్రారంభమైన ఆకాంక్షలను సముచితంగా ప్రతిబింబిస్తున్నందున, రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి నామకరణంగా ఉపయోగించిన టిఎస్‌ని భర్తీ చేయాలని సంబంధిత అన్ని శాఖలను కోరింది. ఈ నేపథ్యంలోనే.. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలతో టీఎస్ స్థానంలో టీజీ పేరుతో లోగో మార్చింది ఎస్పీడీసీఎల్. అయితే.. భవిష్యత్ అవసరాలన్నింటికీ కమ్యూనికేషన్ ప్రామాణీకరణ ఉంటుందని, అధికారిక కమ్యూనికేషన్లన్నింటికీ రాష్ట్రాన్ని సూచించే టీజీని ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చీఫ్ సెక్రటరీ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఇప్పటికే ఉన్న స్టేషనరీ, పాత టీఎస్ నామకరణం ఉన్న ప్రింటెడ్ మెటీరియల్‌ను పరిశీలించాలని శాఖలను కోరారు. అధికారిక పత్రాల నుండి టీఎస్ యొక్క కాలపరిమితి భర్తీకి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని మరియు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి అధికారిక హోదా మరియు కమ్యూనికేషన్ మోడ్‌గా అప్డేట్ చేయబడిన టీజీతో ఓవర్ ప్రింటింగ్‌తో భర్తీ చేయాలని వారిని ఆదేశించారు.

## బలమైన ప్రభుత్వంతోనే

# శత్రుదేశాలకు వణుకు

- అప్పుడే మనవైపు కన్నెత్తి చూడాలంటే ఆలోచిస్తారు
- అయోధ్య, కాశ్మీర్ సమస్యలను పరిష్కరించాం
- అధికారం కోసం కాంగ్రెస్ ఆచరణసాధ్యం కాని హామీలు
- అవి అమలు చేస్తే దేశం దివాళా తీయడం ఖాయం
- పదేళ్లలో మా లక్ష్యం ఎంత బలంగా ఉందో చాటాం
- అంబాలా, ముంబై ప్రచారంలో ప్రధాని మోడీ


2 లో

# ఓటర్లను రెచ్చగొడుతున్న మోడీ


2 లో

- బుల్‌డోజర్లు మావద్ద అయితే లేవు
- రెగ్గొట్టేవారిపై
- ఇసి చర్యలు తీసుకోవాలి
- ఇండియా కూటమి
- చట్టబద్దంగా పాలిస్తుంది
- ముంబైలో ఉమ్మడి మీడియా సమావేశంలో ఖర్గే


2 లో

# భూ వివాదంలో...

## మాజీమంత్రి మల్లారెడ్డి

- మంత్రి మరో 15మంది మధ్య తగవు
- భూమి తమదంటే తమదని వాదులాట
- కోర్టు తీర్పు తమకే అనుకూలమన్న 15మంది
- ఫెన్సింగ్ తొలగించేందుకు
- మల్లారెడ్డి అనుచరుల యత్నం
- ఉద్రిక్తత నేపథ్యంలో మల్లారెడ్డిని
- అదుపులోకి తీసుకున్న పోలీసులు


2 లో

## చినుకు పడితే రంగురాళ్ల వేట

# టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్:** టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్టీయూ హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎప్‌సెట్ పరీక్ష లు రాసిన అభ్యర్థులు తమ ఫలితాలకు సంబంధించిన ర్యాంకు కార్డులను టీఎస్ఎప్‌సెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన ఈఏపీసెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) పరీక్షలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 3.35 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 88.25శాతం బాలురు, 90.18శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్‌లో 74 38శాతం బాలురు, 75.85శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. రెండు విభాగాల్లోనూ బాలురే టాప్‌లో ఉన్నారు. తెలంగాణలో ఇదే మొదటి ఈఏపీసెట్. కాగా, ఈ పరీక్షకు అగ్రికల్చర్ , ఫార్మ విభాగాలకు 91,633 మంది విద్యార్థులు హాజరవగా.. వీరి శాతం 91.24 శాతం ఉంది. ఇంజనీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా మొత్తం ఈఏపీసెట్ కి 3,32,251 మంది విద్యార్థులు హాజరయ్యారు. టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో తొలి 9 ర్యాంకులను అబ్బాయిలు కైవసం చేసుకున్నారు. ఇందులో మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులు సాధించారు. టాప్ 10 ర్యాంక్‌లో ఒక్క అమ్మాయి మాత్రమే నిలిచింది. ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సతివాడ జ్యోతిరాదిత్య - శ్రీకాకుళం, రెండవ ర్యాంక్ గొల్ల లేఖ హర్ష - కర్నూల్, మూడవ ర్యాంక్ రిషి శేఖర్ శుక్ల సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్‌లో ఒక్క అమ్మాయి మాత్రమే నిలిచింది. ధనుకొండ శ్రీనిధి - విజయనగరం,10వ ర్యాంక్ సాధించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల వెల్లడి సందర్భంగా విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. గతేడాది వరకు ఎంసెట్ పేరు మీద పరీక్షలు నిర్వహించామని, ఈసారి ఎంసెట్ పేరును మార్చి ఎప్‌సెట్‌ను మొదటి సారిగా నిర్వహించామని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 1,00,432 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 91,633 మంది 91.24 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక ఇంజినీరింగ్ విభాగానికి 2,54750 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,40,618 మంది 94.45 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. ఈఏపీసెట్ రాసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈసారి పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గతంలో ఒక్కో షిఫ్ట్ లో 25 వేల మంది మాత్రమే పరీక్ష రాసేవారు. ఈసారి ఒక్కో షిఫ్ట్‌లో 50వేల మంది పరీక్ష రాసినట్లు ఆయన వెల్లడించారు. ఫలితాలు చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు. త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూలును విడుదల చేస్తానమని లింబాద్రి తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రి రెండు స్ట్రీమ్‌లలోనూ ఏపీ విద్యార్థులదే మొదటి ర్యాంకు సాధించారు. ఇక ఎంసెట్ ఫలితాల్లో మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులకే రావడం విశేషం.

# కావేరీ జలాలపై పట్టింపు లేని స్టాలిన్

**చెన్నై:** రాష్ట్రంలో దశాబ్దాలుటా డీఎంకేకు వంతపాడుతుంటే కాంగ్రెస్ ఎలా అభివృద్ధి చెందగలదని, తెలంగాణా మాజీ గవర్నర్, సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశ్నించారు. ఏ పార్టీ అయినా స్వశక్తితో ఎదగాలని, ఇతర పార్టీల దయాదాక్షిణ్యాల పై ఎదగకూడదని హితవు పలికారు. శనివారం ఆమె వేలూరు జిల్లా స్వర్ణాలయ సందర్శనకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కావేరి డెల్టా జిల్లాలకు 2.5 టీఎంసీల కావేరి జలాలు విడుదల చేయాలని కావేరి నిర్వాహక మండలి కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలిచ్చినా ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇండియా కూటమిలోనే డీఎంకే, కాంగ్రెస్ పార్టీలున్నాయని, అలాంటప్పుడు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి స్టాలిన్ కావేరి జలాల కోసం ఎందుకు ఒత్తిడి చేయలేకపోతున్నారో తనకు అర్థం కావడం లేదని తమిళిసై అన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారాలు జోరుగా జరుగుతున్నా డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆమె ఆరోపించారు.

# భూ వివాదంలో... మాజీమంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్:** మాజీ మంత్రి మల్లారెడ్డి వర్సెస్ 15 మంది మధ్య భూ వివాదం తారాస్థాయికి చేరింది. కోర్టు వివాదంలో ఉన్న తమ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి కలిసి స్థలంలో వేసిన బారికేడ్లను తొలగించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పోలీసులతో కూడా మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు వాగ్వాదానికి దిగారు. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82 లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి వాదిస్తున్నారు. అందులో 1.11 ఎకరాల భూమి తమదంటూ మరో 15 మంది వాదనకు దిగారు. ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేశామని సదరు 15 మంది వ్యక్తులు చెబుతున్నారు. కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వారు అంటున్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఘటనా స్థలంలో ఎలాంటి గొడవలు చేయొద్దని ఇరువర్గాలకూ పోలీసులు సర్దిచెప్పారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని ఆ 15 మంది వ్యక్తులు చెబుతున్నారు. ఈ ఘటనతో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉద్రిక్తత నెలకొంది. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో నెలకొన్న భూ వివాదంలో మాజీ మంత్రి మల్లారెడ్డికి, ఇతరులకు మధ్య వాగ్వాదం జరిగింది. అయితే తమ భూమిని కబ్జా చేస్తున్నారంటూ మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి చుట్టూ అక్రమంగా ఫెన్సింగ్ వేశారని.. దాన్ని తొలగించాలని తన అనుచరులను ఆదేశించారు. తనది, తన అల్లుడు రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అయితే, మల్లారెడ్డి ఆదేశాలతో ఆయన అనుచరులు బారికేడ్లు, ఫెన్సింగ్ లను తొలగిస్తుండగా ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురికి సద్దిచెప్పేందుకు యత్నించారు. వివాదంలో ఉన్న భూమిలో ఘర్షణకు దిగొద్దని పోలీసులు మల్లారెడ్డి సహా, మరో వర్గానికి సద్దిచెప్పారు. అయితే, తన భూమిలో ఫెన్సింగ్ వేస్తే చూస్తూ ఎలా ఊరుకున్నారంటూ పోలీసులతో మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. 'నాపై కేసు పెడితే పెట్టుకోండి. నా స్థలాన్ని నేను కాపాడుకుంటా' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ముందే మల్లారెడ్డి అనుచరులు ఫెన్సింగ్ తొలగించారు. కాగా, గతంలో ఈ భూమి తమదేనంటూ 15 మంది వచ్చారు. 400 గజాల చొప్పున 1.11 ఎకరాల భూమిని కొన్నామని.. కోర్టు తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. మాజీ మంత్రి అనుచరులు తమను బెదిరిస్తున్నారని 15 మంది ఆరోపిస్తున్నారు. అయితే, ఈ స్థలంపై కోర్టు ఆర్డర్ ఉన్నందున సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు ఇరు వర్గాలకు సూచించారు. 14 ఏళ్ల కిందటే తాము ఈ ప్రాపర్టీ తీసుకున్నామని మాజీ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. '2 ఎకరాల 10 గుంటల భూమికి సంబంధించి అన్నీ డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే, ఇదే సర్వే నెంబర్ లో తమకు భూమి ఉందంటూ కొందరు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించారు. 8 ఏళ్ల నుంచి కోర్టులో కేసు నడుస్తుంది. వారు 4 ఎకరాల 26 గుంటలు ఉన్నాయని చెబుతున్నారని.. డాక్యుమెంట్లు ఉంటే సర్వే చేయించుకోమని చెప్పాం. అయినా దౌర్జన్యంగా రాత్రికి రాత్రే మా భూమిలో షెడ్లు కూలగొట్టి ల్యాండ్ కబ్జా చేసేందుకు యత్నించారు. రౌడీలను పెట్టి దౌర్జన్యం చేయాలని చూస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మా భూమిని కాపాడుకోవాలని ఇక్కడకు వచ్చాం. అన్నీ డాక్యుమెంట్లు చెక్ చేసుకోవాలని చెప్పాం. దీనిపై కమిషనర్ కు సైతం ఫిర్యాదు చేస్తాం.' అని మల్లారెడ్డి చెప్పారు. అయితే భూ వివాదానికి సంబంధించి మాజీ మంత్రి మల్లారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పోలీస్ స్టేషన్ కు భారీగా చేరుకోగా.. పోలీసులు వారిని నిలువరించారు.

# చినుకు పడితే రంగురాళ్ల వేట

**కర్నూలు:** చినుకు పడిందంటే రైతులకే కాదు.. మరికొందరికి కూడా ఆనందమే. అక్కడి ప్రజలు వరుణుడి కరుణ కోసం రైతుల కంటే ఎక్కువగా ఎదురు చూస్తూ ఉంటారు. వరుణుడి రాక తమ జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందని ఆశగా ఆకాశం వంక ఎదురు చూస్తూ ఉంటారు. చినుకు పడితే ఇక వారంతా రంగురాళ్ల వేటలో పడతారు. కర్నూలు జిల్లాతో పాటు దాని పరిసర ప్రాంత ప్రజలు. వారికి ఏమవసరం అంటే.. వజ్రాల దొరుకుతాయని ఓ నమ్మకం. గతంలోనూ ఇలా దొరికిన సందర్భాలు కోకొల్లలు. రెండు రోజులుగా తొలకరి జల్లులు కురవడంతో ఇక్కడి ప్రజలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. వెంటనే కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి వెళ్లి వజ్రాల అన్వేషణను ప్రారంభించారు.

# మెట్రో సమయాల్లో ఎలాంటి మార్పు లేదు

## స్పష్టం చేసిన హైదరాబాద్ మెట్రో అధికారం



**హైదరాబాద్:** ప్రయాణికుల రద్దీ కారణంగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేశారంటూ వస్తోన్న వార్తలను మెట్రో అధికారులు ఖండించారు. మెట్రో రాకపోకల్లో ఎలాంటి మార్పు లేదని.. ఎప్పటిలానే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం రాత్రి 11:45 గంటల వరకు, అలాగే, ప్రతి సోమవారం ఉదయం 5:30 గంటల నుంచే రైళ్ల రాకపోకలపై పరిశీలన మాత్రమే జరిగిందని.. ఇంకా ఆ టైమింగ్స్ పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ, రైళ్లు, ట్రాక్ నిర్వహణ వంటి వాటిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మెట్రో రైళ్ల టైమింగ్స్ విషయంలో ప్రయాణికులెవరూ అయోమయానికి గురి కావొద్దని, యథావిధిగా నిర్దిష్ట సమయానికే రాకపోకలు ఉంటాయని స్పష్టత ఇచ్చారు. కాగా, మెట్రో టైమింగ్స్ మారాయని.. ప్రతిరోజూ రాత్రి 11:45 గంటల వరకూ చివరి రైలు అందుబాటులో ఉంటుందని.. అలాగే ప్రతి సోమవారం ఉదయం 5:30 గంటలకే మెట్రై రాకపోకలు ప్రారంభం కానున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారంపై అధికారులు క్లారిటీ ఇచ్చారు.

# బలమైన ప్రభుత్వంతోనే శత్రుదేశాలకు వణుకు



**అంబాలా/ముంబై:** కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండాల్సిన అవసరాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనొక్కిచెప్పారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటే శత్రువు మనపై ఏది చేయాలన్నా ఒకటికి వంద సార్లు ఆలోచిస్తాడని అన్నారు. ఎన్నికల ఘట్టం చివరిదశకు చేరుకుంటున్న వేళ ప్రధాని మోడీ ప్రచారంలో దూసుకుపోతున్నారు. హర్యానాలోని అంబాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ శనివారంనాడు ప్రసంగించారు. ఆరో విడత ఎన్నికల్లో భాగంగా హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలకు మే 25న పోలింగ్ జరుగనుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..దేశంలో బలమైన ప్రభుత్వం ఉంటే, శత్రువులు మనపై ఏది చేయడానికైనా ముందు వందసార్లు ఆలోచిస్తారు. పాకిస్థాన్ 70 ఏళ్ల నుంచి భారతదేశానికి ఇక్కట్లపాలు చేస్తోంది. వాళ్లకు చేతిలో బాంబులు ఉన్నాయి. ఇవాళ వాళ్ల చేతుల్లో భిక్షాపాత్ర ఉంది. బలమైన ప్రభుత్వం అనేది ఉంటే శత్రువులు వణుకుతారని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌ను ప్రస్తావిస్తూ, అక్కడి పరిస్థితిని బలహీన ప్రభుత్వం ఉంటే మార్చగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయాన్ని ఓసారి గుర్తుచేసుకుంటే హర్యానాలోని వీరమాతలు రేయింబవళ్లు ఆందోళనతో ఉండేవారనీ, ఈరోజు పదేళ్లుగా అవన్నీ ఆగిపోయాయని చెప్పారు. బలమైన మోదీ ప్రభుత్వం 370వ అధికరణ అనే గోడను కూల్చేసిందని, కశ్మీర్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడడానికి మరో 17 రోజులే ఉన్నాయని, నాలుగు విడతల పోలింగ్‌లో ఇండియా కూటమి ఎత్తులను ప్రజలు చిత్తుచేశారని అన్నారు. దేశభక్తి నరనరాల్లో ఉన్న రాష్ట్రం హర్యానా అని, దేశవ్యతిరేక శక్తులు ఏవో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. ప్రజల కలలు పండించడమే తన రిజల్యూషన్ అని, అదే తన గ్యారెంటీ అని మోదీ హామీ ఇచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా రేయింబవళ్లు పనిచేస్తానని, వికసిత్ భారత్‌కు పేదలు, యువకులు, మహిళలు, రైతులు నాలుగు మూల స్తంభాలని చెప్పారు. నా దేశం, నా హిందుస్థాన్ బలపడాలనే ఆలోచనతో ఈ నాలుగు స్తంభాలను పటిష్ఠం చేస్తానని అన్నారు. ఇకపోతే తరవాత మహారాష్ట్రలో పర్యటించారు. కాంగ్రెస్ చెబుతున్న మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తే భారత్ దివాళా తీయడం ఖాయమని ప్రధాని మోదీ విమర్శించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం ముంబయిలో పర్యటించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి ముంబయికి నమ్మకద్రోహం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని మావోయిస్టుతో పోల్చిన ఆయన.. దాన్ని అమలు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పతానావస్థకు చేరుతుందని చివరకు భారత్ దివాళా తీస్తుందని విమర్శించారు. మనుగడే కష్టంగా మారిన కాంగ్రెస్ ఇష్టానుసారంగా హామీలు ఇస్తోంది. దేవాలయాల్లో బంగారం, మహిళల మెడలో మంగళసూత్రాలపై ఆ పార్టీ కన్ను పడింది. 50 శాతం వారసత్వ పన్ను విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ప్రజల ఆస్తిని ఎక్స్ రే తీసి, ఓట్ జిహాద్ గురించి మాట్లాడే వారి ఓటు బ్యాంకుకు అప్పగిస్తోంది. పది సంవత్సరాల పాలనాకాలానికి సంబంధించిన రిపోర్ట్ కార్డు, 25 సంవత్సరాల దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం నా వద్ద ఉన్న ప్రణాళికలు ఒక వైపు, పదుల సంఖ్యలో ప్రధాని అభ్యర్థులు ఉన్న ఇండియా కూటమి మరో వైపు నిలబడ్డాం. ప్రజలు ఎటు వైపు ఉండాలో ఇప్పటికే తేల్చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దైనా అతి కష్టంతో కూడుకున్న పనులు. వాటిని మా హయాంలో పూర్తి చేయగలిగాం. ఇవన్నీ మీ విలువైన ఓటుని సరైన నాయకత్వానికి అప్పగించడం వల్లే అయ్యాయి. మరోసారి బీజేపీ సర్కార్‌ని ఆశీర్వదించండని ప్రధాని మోదీ ఓటర్లను కోరారు.

# ఓటర్లను రెచ్చగొడుతున్న మోడీ



ముంబై: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓటర్లను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. విపక్ష 'ఇండియా'కి ఓటు వేసి గెలిపిస్తే రామాలయంపై బుల్డోజర్ నడిపిస్తుందంటూ పదేపదే ప్రధాని చేస్తున్న వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్సీపీ-ఎస్పీ నేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేతో కలిసి ముంబైలో శనివారంనాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఖర్గే పాల్గొన్నారు. ఇప్పటి వరకూ మాదగ్గర బుల్డోజర్లు లేవు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి. ప్రధానమంత్రే స్వయంగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలను రెచ్చగొడుతున్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ ప్రకారం అన్నింటినీ పరిరక్షిస్తాం. మేము రాజ్యాంగాన్ని అనుసరిస్తాం అని ఖర్గే స్పష్టం చేశారు. మహారాష్ట్రలో నిజమైన పార్టీకి బదులు బీజేపీకి మద్దతిస్తున్న వర్గాలకు ఎన్నికల కమిషన్ గుర్తులను కేటాయించడాన్ని ఆయన తప్పుపట్టారు. నయవంచన, కుట్రలతో మహారాష్ట్రలో చట్టవిరుద్ధంగా 'మహాయుతి' ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రధానమంత్రే స్వయంగా దీనికి మద్దతిచ్చారని, మహారాష్ట్రలో ర్యాలీలు కూడా తీశారని అన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో చీలికలు తెచ్చే ప్రయత్నం చేస్తుంటారని ఆరోపించారు. నిజమైన పార్టీల నుంచి గుర్తులు లాక్కుని బీజేపీకి మద్దతిచ్చే పార్టీలకు వాటిని కేటాయించడం వంటి నిర్ణయాలన్నీ మోదీ ఆదేశాల మీదే జరుగుతున్నాయన్నారు. మహారాష్ట్రలో 'ఇండియా' కూటమి పనితీరుపై ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 48 సీట్లలో 46 సీట్లు తమ కూటమి గెలుచుకుంటుందని, ప్రజలే స్వయంగా ఈ విషయం చెబుతున్నారని అన్నారు. తమ కూటమి బీజేపీని ఓడించి గరిష్టంగా సీట్లు గెలుచుకోవడం ఖాయమని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్య ఎన్నికల డైనమిక్స్‌పై అడిగిన ఒక ప్రశ్నకు ఖర్గే సమాధాన మిస్తూ, ఢిల్లీలో రెండు పార్టీలు బీజేపికి వ్యతిరేకంగా కలిసి పనిచేస్తున్నాయని, పంజాబ్‌లో వేర్వేరుగా పోటీలో ఉన్నాయని చెప్పారు. ఇది ప్రజాస్వామ్యం. బీజేపీని ఓడించడానికి ఏమి చేయాలో అది చేస్తాం అని ఖర్గే తెలిపారు. లోక్‌సభ ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మహారాష్ట్రలోని 6 నియోజకవర్గాల్లో మే 20న పోలింగ్ జరుగనుంది. ధులే, దిండోరి, నాసిక్, కల్యాణ్, పాల్ఘర్, భివాండీ, థానే నియోజకవర్గాలు ఇందులో ఉన్నాయి.

# గ్రూప్-1 పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి.

**- వీడియో కాన్ఫరెన్స్ లో టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి.**





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 18**

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జూన్ 9వ తేదీన జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీ ఎస్ పీ ఎస్ సీ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్ల గురించి, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ తెలియజేశారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాన్నం 1.00 గంట వరకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. అయితే, ప్రిలిమ్స్ పరీక్షకు బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10.00 గంటల వరకే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేయాలని స్పష్టం చేశారు. ఈసారి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్లతో పాటు బయో మెట్రిక్ కాప్చర్ కోసం 160 మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ప్రత్యేకంగా అదనపు ఇన్విజిలేటర్ లను సైతం నియమించాలని సూచించారు. బయోమెట్రిక్ వేలిముద్రల సేకరణ ప్రక్రియ కోసం పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు నోడల్ పోలీస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. సెల్ ఫోన్, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఎగ్జామ్ ప్యాడ్ కు అనుమతి ఉండదని, అభ్యర్థులు వాటిని వెంట తెచ్చుకోకూడదని, వీలైనంత వరకు చెప్పులు ధరించి రావాలని హితవు పలికారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలన్నారు. దివ్యంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమవెంట వైకల్యం ధృవీకరించే సర్టిఫికెట్ తేవాలని చైర్మన్ స్పష్టం చేశారు. హాల్ టికెట్ లో పొందుపర్చబడిన పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు ముందుగానే వెళ్లి పరిశీలించుకుంటే పరీక్ష రోజున గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉండదని హితవు పలికారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు.

వివిధ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులంతా ఉదయం 9.00 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, పరీక్షా గదుల్లో తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్ ఇత్యాది వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని, అన్ని కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితరులకు పరీక్షల నిర్వహణ తీరు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వీలుగా శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలలోనూ సీ.సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, ఈ మేరకు టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలను తు.చ తప్పకుండా పాటించేలా చూడాలని సూచించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రశ్న పత్రాలు, ఇతర పరీక్షా సామాగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుండి ఎగ్జామినేషన్ సెంటర్స్ కు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రం లోనికి ఇతరులు ఎవరిని అనుమతించకూడదని, పరీక్షా సమయం ప్రారంభం నుండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీ.సీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఈఏపిసెట్ ఫలితాల్లో "కాకతీయ"కు స్టేట్ ర్యాంకులు.


ఇంటర్ తో పాటు నేరుగా తొలి ప్రయత్నంలోనే ఉత్తమ ఫలితాలు.

విద్యా సంస్థ డైరక్టర్లు తేజస్విని, రామోజీ రావు.

విద్యార్థులను అభినందించిన చైర్ పర్సన్ సిఎచ్. విజయలక్ష్మి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 18:**

తెలంగాణలో శనివారం విడుదలైన ఈఏపిసెట్ (గతంలో ఎంసెట్) ఫలితాల్లో "కాకతీయ" విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. ఇంటర్ విద్య తో పాటు విద్యార్థులు నేరుగా తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కాకతీయ విద్యా సంస్థల చైర్ పర్సన్ సిఎచ్. విజయలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా కాకతీయ డైరెక్టర్ సి.హెచ్. తేజశ్విని మాట్లాడుతూ, ఈ అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కాకతీయ ఐఐటి, నీట్, ఎంసెట్ అకాడమీలోని ప్రత్యేక పాఠ్య ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, యాజమాన్య నిరంతర పర్యవేక్షణ, వారాంతపు పరీక్షలే ముఖ్య కారణం అన్నారు. స్టేట్ ర్యాంకులు ఇంటర్ తో పాటు డైరెక్టుగా తొలి ప్రయత్నంలోనే సాధించినవని అన్నారు. కాకతీయ ఐఐటి, నీట్, ఎంసెట్ అకాడమిక్ డైరెక్టర్ సిఎచ్. రామోజీ రావు (ఐఐటి ఐఏఎస్) మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం ప్రకటించిన జేఇఇ మెయిన్స్ ఫలితాలలో, ఈఏపిసెట్ ఫలితాలలో, తెలంగాణ ఇంటర్ ఫలితాలలో, జాతీయ స్థాయి నీట్ ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అన్నారు. నిజామాబాద్ స్థాయిలోనే కాకుండా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటారు అని అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో అధ్యాపకుల బృందం విద్యార్థులను పుష్పగుచ్చాలతో అభినందించారు.




### చక్కని ప్రణాళిక తోనే...

**- మహిరా.**

కాకతీయ కళాశాలలో ఇంటర్ చదువుకున్నాను. ఈఏపి సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 1424 ర్యాంక్ సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ అత్యుత్తమమైన ఫలితాలు సాధించడానికి కాకతీయ విద్య సంస్థల డైరక్టర్ సి ఎచ్ తేజస్విని, అధ్యాపక బృందం సహకారం ఎంతాగానో ఉంది. విద్యా సంస్థ చక్కటి ప్రణాళికలు, పరీక్షలు నిర్వహణ, వ్యక్తి గతి శ్రద్ధ వలన స్టేట్ ర్యాంకు సాధించాను. భవిష్యత్తులో గైనకాలిస్ట్ స్థిర పడాలని లక్ష్యం.

### క్లౌడ్ ప్రోగ్రామర్ అవుతాను.

**- మినాజ్.**

కాకతీయలో ఐఐటి, నీట్ అకాడమీ లో ఇంటర్ చదువుకున్నాను. ఈఏపిసెట్ ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే 2224 స్టేట్ ర్యాంకు సాధించాను. ఇంతటి ఫలితాన్ని సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి, యాజమాన్యం వారికి ధన్యవాదములు. సంస్థ డైరెక్టర్ రామోజీ రావు సలహాలు, సూచనలు, అధ్యాపకుల ప్రణాళిక బద్ధమైన బోధన ఎంతగానో ఉపయోగపడింది. వారంతపు పరీక్షలు, ఒత్తిడి లేని సులభమైన విద్యా విధానం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించాను. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ విభాగంలో క్లౌడ్ ప్రోగ్రామర్ కావాలని లక్ష్యం.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి.

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 18**

ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు, జూన్ 3 నుండి 13 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్, పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత విభాగాలతో నిర్వహించిన సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాన్నం 12.00 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాన్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. ఇట్టి సప్లమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందులో మొదటి సంవత్సరం జనరల్ , ఒకేషనల్ విద్యార్థులు 6,236 కాగా ద్వితీయ సంవత్సరంలో 4,275 మంది విద్యార్థులున్నారని అన్నారు. ఇందుకోసం జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంటల్ అధికారిని నియమించామన్నారు. మాల్ ప్రాక్టీస్ ను అరికట్టుటకు 2 ఫ్లైయింగ్ స్క్వాడ్, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జూన్ 3 నుండి 13 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు జరుగు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 869 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకోసం కామారెడ్డి, బాన్సువాడ మండల కేంద్రాలలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. రెండు కేంద్రాలకు చీఫ్ సూపెరింటెండెంట్లను, డిపార్ట్మెంటల్ అధికారులను, రూట్ అధికారిని, కస్టోడియన్లను, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతో ఏ.యెన్.ఎం లను అందుబాటులో ఉంచాలని, పరిసర ప్రాంతాలను శు భ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలు చేరుకునేలా వివిధ రూట్లలో ఉదయం వేళలో బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కు సూచించారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని రెవెన్యూ అధికారులను, ప్రతి కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలిసు అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు చరవాణి లు అనుమతి లేదని, ఒక్క నిముషం ఆలస్యమైన పరీక్ష హాలుకు అనుమతించబడదని విద్యార్థులు ఈ విషయాలను గమనించి సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# "ఆరోగ్యం" కోసం వస్తే అందినకాడికి "దోపిడే"




ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టా రాజ్యం.

మెడికవర్ ఘటనే అందుకు నిదర్శనం.

కలెక్టర్ సీరియస్, నోటీసులు జారీ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 18:**

జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులో అంతులేని దోపిడీ కొనసాగుతుంది. ఆరోగ్యం కోసం వచ్చే రోగుల నుండి అందినకాడికి రకరకాల పేరుతో దోచుకుంటున్న సంబదిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనితో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రైవేటు ఆస్పత్రుల భరతం పట్టేందుకు సిద్దమయ్యారు. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన మెడికవర్‌లో ఇటీవల ఓ యువకుడు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే మృతి చెందాడని బంధువులు ఆందోళన చేశారు. ఈ విషయం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే వైద్యారోగ్య శాఖ అధికారులకు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ పర్యవేక్షణలో ఉన్నతాధికారులతో కూడిన విచారణ కమిటీని వేశారు. వీరు నిజనిజాలు నిగ్గు తేల్చనున్నారు. విచారణలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడితే వెంటనే ఆ ఆస్పత్రిని సీజ్ చేయడానికి రెడీ అయ్యింది. దీనితో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యల గుండెల్లో గుబులు మొదలయింది. నగరంలోని ఖలీల్‌వాడీ, ప్రగతి నగర్ లలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఆస్పత్రుల నిర్వహణ, పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం, దోపిడీ సర్వసాధరణమై పోయాయి. మెడికవర్ ఇష్యూతో ప్రైవేటు దోపిడీలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఇలాంటివి చాలా వచ్చినా డీఎంహెచ్‌వోగా పనిచేసిన సుదర్శనం చూసీ చూడనట్టు వ్యవహరించాడు.

# ఉచిత పథకాలపై పునరాలోచన చేయాలి

**న్యూఢిల్లీ:** వివిధ ఉచిత పథకాలను పునరాలోచన చేయాలి. ఉపాధి హామీ వల్ల వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. వాటి కారణంగా గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థ చితికి పోయింది. పనిచేయకున్నా కూలి వస్తోందన్న ధీమాతో ఇతరత్రా కూలీలకు వెళ్లడం లేదు. దీనిని నిర్మాణాత్మక పనులకు అనుసంధానం చేయడం ద్వారా ఆస్తులను సృష్టించే పథరకంగా మార్చాలి. విద్య,వైద్య రంగాలు, కమ్యూనికేషన్, రోడ్లు రవాణా రంగం అభివృద్ధి చేసి, ప్రజలు స్వయం సమృద్ధి సాగించేలా పాలన సాగించాలన్న ఆలోచన చేయడం లేదు. వనరులను ఉపయోగించి దేశాన్ని ఆర్థికంగగా బలోపతేం చేయాలన్న సంకల్పం కానరావడం లేదు. రాష్ట్రాలు కూడా ప్రజాకర్షక పథకాలతో డబ్బుల పందేరం చేయడం ద్వారా..ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా అవుతున్నాయి. ఇలాంటి దుబారా పథకాలపై కేంద్రం అజమాయిషీలో నియంత్రణ ఉండాలి. పండగలు, పబ్బాలు, కులాలు,మతాల పేరుతో డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేయకుండా, కేవలం అభివృద్ది పథకాలకు మాత్రమే ఖర్చు చేయగలగాలి. జిఎస్టీ ఆమోదించినప్పుడే వ్యక్తం అయిన అభ్యంతరాలను గమనించి పెద్దమొత్తంలో పన్నుల విధింపును భారంగా గుర్తించి ఆలోచన చేసివుంటే బాగుండేది. తొలుత వసూళ్లకు అలవాటు పడి ,ఇప్పుడు జిఎస్టీ తగ్గింపు వల్ల నష్టం వస్తోందని ప్రకటించడం కేవలం వ్యాపారధోరణి తప్ప మరోటి కాదు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునేముందు నిపుణులతో చర్చించాలి. ఇలా చెబుతూ పోతే జిఎస్టీ ధరాఘాతాలపై పుస్తకాలే రాయొచ్చు. అయితే జిఎస్టీ అమలు కోసం తొందరపాటు ప్రదర్శించిన సమయం లోనే దీనిపై సవాలక్ష అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు గగ్గోలు పెడుతున్నా, వ్యాపారులు ఆందోళన చేస్తున్నా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ సర్కార్ దూకుడుగా అమలు చేసింది. అనేక అంశాలపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినా అవి చెల్లుబాటు కాలేదు. జీఎస్‌టీకి అమలుకు కేంద్రం వ్యవహరిస్తున్న తీరే తమను ఆందోళనకు గురిచేస్తోందని పలు రాష్ట్రాలు చెప్పినా ఫలితం లేకుండా పోయింది.కేవలం వ్యాపార ధోరణితో తీసుకున్న నిర్ణయం తప్ప పాలనా సంస్కరణ అనడానికి లేకుండా చేశారు. నేటికీ వ్యాపారుల్లో ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వర్తకులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదు. చివరకు చేనేత లాంటి రంగాలపైనా జిఎస్టీ వేయడం దారుణం కాక మరోటి కాదు. నోట్లరద్దు సమయంలో వ్యవహరించిన తొందరపాటునే ఇక్కడా ప్రదర్శిస్తున్నారు. దుష్పరిణామాలు వస్తున్నా సరిదిద్దుకోవడం లేదు. జిఎస్టిపై చిన్న, మధ్యతరగతి వ్యాపారులు ఆందోళనతో ఉన్నారు. అభ్యంతరాలకు అవకాశం ఇవ్వకుండా ఒకే దేశం ఒకే పన్ను విధానం అంటూ అమలులోకి తీసుకుని వచ్చాక గానీ ప్రజలకు జిఎస్టీ అంటే ఏమిటో తెలిసింది.

# హీరామండి

## మరువలేని అనుభవం

### మనీషా కోయిరాలతో నటించడం అదృష్టం: సోనాక్షి



ప్రస్తుతం 'హీరామండి'కు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనాక్షి సిన్హా తన సహనటి మనీషా కొయిరాలకు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించారు. 'నాకు మనీషా అంటే ఎంతో ఇష్టం. 'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ మొత్తం చూసిన తర్వాత ఆమెకు క్షమాపణలు చెప్పాను. కొన్ని సన్నివేశాల్లో భాగంగా ఆమెతో దురుసుగా ప్రవర్తించాను. సిరీస్ చూశాక నేను వాటిని ఎలా చేయగలిగాను అనిపించింది. అందుకే సారీ చెప్పాను. ఆమె గొప్ప నటి. తన సహనటులను ఎంతో ప్రోత్సహిస్తారు. షూటింగ్ మొత్తం సరదాగా గడిపాం. అంత గొప్ప నటితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. మళ్లీ ఆమెతో నటించే రోజు కోసం ఎదురుచూస్తున్నా' అన్నారు. ఇక సంజయ్ లీలా భన్సాలీ గురించి మాట్లాడుతూ.. 'ఆయన దర్శకత్వంలో నటిస్తే కష్టపడాల్సిన అవసరం లేదు. సీన్‌కు ముందే అన్ని విషయాలు చర్చిస్తారు. భన్సాలీ నన్ను మెచ్చుకోవడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇంత గొప్ప పాత్రను ఇచ్చినందుకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను' అని చెప్పారు.

'హీరామండి'లో సోనాక్షి ద్విపాత్రాభినయం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఆమె నెగెటివ్ ఛాయలున్న పాత్రల్లో కనిపించారు. వేశ్యల జీవితాల ఆధారంగా ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన ఈ సిరీస్‌లో మనీషా కొయిరాలా, అదితిరావు హైదరి, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్ ఇతర కీలకపాత్రలు పోషించారు. దీనిపై బాలీవుడ్‌స్టార్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.



# హాలీవుడ్ మ్యాగజైన్‌లో దీపికా పడుకొణె

డెడ్‌లైన్స్ గ్లోబల్ డిస్‌రప్టర్స్ అనే హాలీవుడ్ మ్యాగజైన్ ప్రతీ ఏడాది.. ప్రపంచవ్యాప్తంగా వినోదరంగంలో రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటీనటుల జాబితాను విడుదల చేస్తుంది. ఇటీవలే విడుదల చేసిన ఈ ఏడాది జాబితాలో ప్రముఖ బాలీవుడ్ అగ్రతార దీపికా పదుకొణె చోటు దక్కించుకుంది. ఈ గౌరవాన్ని అందుకున్న ఏకైక భారతీయ నటిగా దీపిక నిలిచింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ..కొన్ని ఆసక్తికర విషయాల్ని తన అభిమానులతో పంచుకుంది. 'నటించిన సినిమా విజయం అందుకోవాలి, బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురవాలి, పాత్ర మెప్పించాలి, సినీ ప్రియులు కథనంతో పాటు సాగిపోయేలా కథలను ఎంపిక చేసుకోవాలి, అవార్డులు ప్రశంసలు దక్కాలి, మంచి స్థాయిలో ఉండాలి..ఇలా ఇవే ముఖ్యమంటారు కొందరు నటీనటులు. నా దృష్టిలో ముఖ్యమైనవి ఏమైనా ఉన్నాయంటే అది ఒక మంచి వ్యక్తిగా ఎదగడం, మంచి వ్యక్తులతో సమయం గడపడం, సెట్‌లోని అనుభవాలను మర్చిపోలేని జ్ఞాపకాలుగా గుర్తుచేసుకోవడం. ఇవే నాకు ముఖ్యం. ఇప్పుడీ గౌరవానికి కూడా కారణం అదే అని నా అభిప్రాయం'. ప్రపంచం చాలా చిన్నదై పోయిందని నేను అనుకుంటున్నా. సినీ రంగంలోని పరిశ్రమలన్నీ ఒక్కచోట చేరి ఈ ప్రపంచానికి గొప్ప కథలు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. మనం చెప్పే కథల వల్లే ఈ ప్రపంచంలో మార్పులు వస్తున్నాయని నేననుకోవట్లేదు. ప్రేక్షకులు మెచ్చేలా, ఆశ్చర్యపోయేలా, ఆసక్తికరమైన కథలు మాత్రమే మనం చెబుతున్నాం. అదే జరుగుతుంది కూడా'. 'ఓం శాంతి ఓం' సినిమా కోసం నేను అసలు ఆడిషన్ ఇవ్వలేదు. 2007లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రంతోనే నేను బాలీవుడ్‌కి పరిచయమయ్యా. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఏ ఆడిషన్ చేయకుండానే నన్ను ఎంపిక చేశారు.అలా మొదలైన నా ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా'.

'బాలీవుడ్‌లోనే కాదు హాలీవుడ్‌లోనూ నన్ను ప్రేక్షకుల ఆదరిస్తున్నారు. పదేళ్ల క్రితం నేను హాలీవుడ్ సినిమాలకు ఆడిషన్ ఇచ్చా. అక్కడంతా కొత్త విధానం. అక్కడి సినిమాలోని నటనకు తగ్గట్టు నేను ఫాన్సీ యాక్టింగ్ స్కూల్లో చేరలేదు, ఇంగ్లిష్ నటనలో శిక్షణ తీసుకోలేదు. కానీ ఒక్కసారి హాలీవుడ్‌లో అడుగుపెట్టిన తర్వాత ఇంగ్లిష్ సినిమాలకి తగ్గ నైపుణ్యాలను నేర్చుకున్నట్లు చెప్పారు.

# సంగ్రామ్ భలేరావ్‌గా రణ్‌వీర్ సింగ్



సంగ్రామ్ భలేరావ్‌గా 'సింగమ్ అగైన్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నాడు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. రోహిత్ శెట్టి దర్శకత్వంలో రానున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రణ్‌వీర్ తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. ఈ షూటింగ్ పూర్తయ్యాక అదిత్య ధర్‌తో ఓ సినిమాని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దానికి 'ధురంధర్' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు తెలిసింది. 'ఈ కలయికలో రానున్న తొలి చిత్రం కాబట్టి చిత్రబృందం ఈ సినిమాని ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కించనుంది. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ని రాజకీయాలు, గ్యాంగ్‌వార్ నేపథ్యంలో రూపొందించనున్నారు. జూన్‌లో దీని చిత్రీకరణను మొదలుపెట్టనున్నారు' అని సన్నిహితవర్గాలు తెలిపాయి.

# పవిత్రతో చందు వివాహేతర సంబంధం



**ఆమె మోజులో పడి ఆత్మహత్య**

**భార్య శిల్ప ఆవేదన**

బుల్లితెర నటుడు చందు ఆత్మహత్యపై ఆయన భార్య శిల్ప స్పందించారు. ఐదు సంవత్సరాలుగా పవిత్రతో చందు సహజీవనం చేస్తున్నట్లు ఆమె మీడియా ముందు చెప్పారు. 'త్రినయిని' సీరియల్ వచ్చినప్పటి నుంచి వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగిందన్నారు. చందు తన వెంటపడి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని.. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆమె వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా పవిత్ర మాయలో పడి తమను పట్టించుకోవడం మానేశాడని, ఇంటికి కూడా రావడం లేదని బాధను వ్యక్తం చేశారు. ఇంకా ఆమె మాట్లాడుతూ 'వివాహం జరిగిన తర్వాత వివాహేతర సంబంధం మూలంగా జీవితాలు నాశనం అవుతున్నాయి. ప్రస్తుతం మా పరిస్థితి కూడా అలాగే ఉంది. పవిత్ర ఆకస్మిక మృతితో చందు ఒత్తిడికి గురయ్యాడు. ఇటీవల కత్తితో కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. పవిత్ర నీ దగ్గరికి వస్తున్నా అంటూ ఇన్‌స్టాలో మెసేజ్ కూడా పెట్టారు. శుక్రవారం ఆయన ఫోన్ ఎత్తకపోయేసరికి అనుమానంతో తెలిసిన వాళ్లను అక్కడికి పంపాము. అప్పటికే ఆయన ఫ్యానుకి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డట్లు' శిల్ప చెప్పారు. తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని శిల్ప వేడుకున్నారు.

# సూర్యకు జోడీగా బుట్టబొమ్మ



సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా జూన్ తొలి వారం నుంచి అండమాన్ దీవుల్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో పడింది చిత్ర బృందం. ఇందులో భాగంగా సూర్యకు జోడీగా పూజా హెగ్డేను ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయంపై ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. తొలి షెడ్యూల్ దాదాపు 40రోజులకు పైగా సాగనున్నట్లు తెలుస్తోంది. దీంట్లో మలయాళ నటుడు జోజు జార్జ్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# రామోజీ ఫిల్మ్ సిటీలో మలేషియా సెట్టింగ్

శరవేగంగా పుష్ప-2 షూటింగ్ ఐటమ్ సాంగ్ కోసం జాన్వీని ఒప్పించే ప్రయత్నం అనుకున్న తేదీ ఆగస్ట్ 15న ఎలాగైనా విడుదల చేయాలని 'పుష్ప 2' టీమ్ షూటింగ్ పూర్తి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. అందుకు తగ్గట్టే రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. అయితే ఐటమ్ సాంగ్ కోసం ఇంతవరకూ ఎవరినీ ఖరారు చేయలేదని తెలుస్తోంది. చివరకు జాన్వీ కపూర్‌ను ఒప్పించేలా డైరెక్టర్ సుకుమార్ ఉన్నట్లు టాక్. ఈ సినిమా కోసం మలేషియాలో కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కించాలనుకొన్నారు. అయితే ఇప్పుడు అంత టైమ్ లేదు. అందుకే హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీనే మలేషియాగా మారుస్తున్నారు. అక్కడ ఈ సినిమా కోసం ఓ భారీ సెట్ తీర్చిదిద్దారు. అక్కడే మలేషియాలో తెరకెక్కించాల్సిన సీన్స్ షూట్ చేస్తున్నారు. 'పుష్ప 2' షూటింగ్ ఎంత వేగంగా జరుగుతున్నా టీమ్‌ని రెండు విషయాలు ఇబ్బంది పెడుతు న్నాయని తెలుస్తోంది. ఒకటి.. ఫహద్ ఫాజిల్ ఈ సినిమాకు డేట్లు కేటాయించడం లేదు. ఈ సినిమా లో ఫహద్ కీలక ప్రాత పోషిస్తున్న సంగతి తెలిసిందే. తనపై ఇప్పటికే కొంతమేర షూటింగ్ చేశారు. అయితే మరో 15 రోజుల కాల్షీట్లు అవసరం అయ్యాయి. కానీ ఫహద్‌కు ఉన్న బిజీ కారణంగా డేట్లు కేటాయించడం లేదు. మరోవైపు ఐటెమ్ సాంగ్ చేసే హీరోయిన్ సమస్య కూడా వెంటాడుతోంది. ఐటెమ్ గాళ్‌గా ఎవరిని తీసుకోవాలన్న విషయంలో ఇంకా ఓ క్లారిటీకి రాలేదని తెలుస్తోంది. చాలామంది అగ్ర కథానాయికల పేర్లు పరిశీలించారు. కానీ ఏదీ ఇంకా ఫైనల్ కాలేదు. ఎవరూ దొరకని పక్షంలో ఈ పాటని జాన్వీకపూర్‌తో చేయాలని భావిస్తున్నారట. ఈ విషయంలో ఈ వారంలో ఓ స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఇటీవల ' 2' నుంచి టైటిల్ సాంగ్ విడుదలైంది. మరో పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

